ప్రజాశక్తి
బుధవారం 20 సెప్టెంబర్ 2023
5
పార్వతీపురం మన్యం

మరచిపోలేని అనుభూతి : ఎమ్‌పి మాధవి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

సంతకం చేస్తున్న ఎంపి మాధవి

అరకు ఎంపి గొడ్డేటి మాధవి పాత పార్లమెంటు భవనంలో మంగళవారం చివరి సంతకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ పాత పార్లమెంటు భవనంలో అరకు నియోజకవర్గానికి సంబంధించి ఎన్నో సమస్యలను ప్రస్తావించడం జరిగిందన్నారు. ప్రస్తావించిన సమస్యల్లో చాలా వరకు పరిష్కారమైనట్లు ఆమె పేర్కొన్నారు. పాత పార్లమెంట్ భవనం ఎన్నో అనుభూతులను ఇచ్చిందన్నారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు సిపిఎం బైక్ యాత్ర

ఈనెల 23న సాయంత్రానికి పాలకొండకు చేరనున్న యాత్ర • స్వాగత సన్నాహాలు

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను గుత్తపెట్టుబడిదారీ సంస్థలకు కట్టబెట్టే ప్రయత్నాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మానుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఉత్తరాంధ్రలో మోటార్ సైకిల్ యాత్ర చేపట్టింది. విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద బుధవారం బైక్‌జాత ప్రారంభం కానుంది. సాయంత్రం 5గంటలకు విజయనగరం జిల్లా కేంద్రానికి చేరనుంది. 6గంటలకు బాలాజీ జంక్షన్‌లో బహిరంగ సభ నిర్వహించ నున్నారు. రాత్రికి నగరంలోని బసచేస్తారు. జాతాలో కేంద్రాన్ని ప్రశ్నించని అధికార, ప్రతిపక్ష పార్టీల రాజకీయ బండారాన్ని సిపిఎం నాయకులు బయట పెట్టనున్నారు.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు అన్న నినాదంతో ఏర్పడిన విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో జిల్లాకు చెందిన వేలాది మంది పర్మినెంట్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారు. ఏటా రూ.వేల కోట్ల ఆదాయాన్ని ప్రభుత్వానికి సమకూరుస్తోంది. సిఎస్ఆర్ నిధుల ద్వారా ఎన్నో గ్రామాలు, పట్టణాల్లో పలు ప్రాంతాల అభివృద్ధికి పరోక్షంగా దోహదపడుతోంది. లక్షలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించింది. వీరి అవసరాలు తీర్చే ట్రాన్స్‌పోర్టు, కూరగాయాలు, టీ, టిఫిన్ వంటి దుకాణాలతో పాటు ఎన్నో వ్యాపారాలు చేస్తూ గాజువాక, కూర్మన్నపాలెం ప్రాంతాల్లో బతుకీడుస్తున్నవారూ వేలాది మంది ఉన్నారు. ఇటువంటి బంగారుబాతు గుడ్డు లాంటి స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వం నష్టాల పేరుతో ప్రైవేటు సంస్థకు అమ్మేస్తుందన్న వార్త విస్మయానికి గురిచేస్తోంది. ప్లాంట్ ప్రైవేటీపరమైతే ఉద్యోగాలు తగ్గిపోతాయి. ఉద్యోగుల, కాంట్రాక్టు కార్మికుల ఉపాధి భద్రత ప్రశ్నార్థకంగా మారుతుంది. ఈ నేపథ్యంలో సిపిఎం ఆధ్వర్యాన స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, కార్మికులు సుమారు ఏడాది క్రితం నుంచి నిరవధికంగా ఆందోళనలు చేస్తున్న విషయం విధితమే. రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమంగా మారింది. ఈ నేపథ్యంలో దిశమార్చుకున్న కేంద్ర ప్రభుత్వం ప్లాంటును ముక్కలుగా విభజించి ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తోంది. ఇంత జరుగుతున్నా రాష్ట్రంలో అధికారంలో వున్న వైసిపిగానీ, ప్రతిపక్ష టిడిపిగానీ, కేంద్రం వద్ద తనకు ఎంతో పలుకుబడి ఉన్నట్టుగా చెప్పుకుంటున్న జనసేన గాని కేంద్ర ప్రభుత్వాన్ని బహిరంగంగా ప్రశ్నించడం లేదు. ఈ మూడు పార్టీలూ లోలోపల లాలూచీ పడడంతోనే కేంద్రం వెనక్కి తగ్గడం లేదు. ఇటువంటి తరుణంలో మన జిల్లాలోని ప్రతి పల్లె తల్లడిల్లుతోంది. ఇందుకు కారణం లేకపోలేదు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై సుమారు 2లక్షలకుపైగా జీవనం సాగిస్తుండగా, అందులో మన జిల్లాకు చెందినవారు తక్కువలో తక్కువగా 20వేల మంది ఉంటారని అంచనా. ఒక్క కాంట్రాక్టు కార్మికులే సుమారు 5వేల మంది ఉంటారు. పర్మినెంట్ ఉద్యోగులు మరో రెండువేల మంది వరకు ఉండవచ్చు. మొత్తం స్టీల్‌ప్లాంట్ ఆధారంగా గాజువాక ప్రాంతంలో జీవిస్తున్న లక్షలాది మందికి పాలు, కూరగాయాలు, టీ, టిఫిన్, హోటల్స్, ఆటోలు, కార్లు నడుపుతూ వేలాది కుటుంబాలు ఉన్నాయి. ఈనేపథ్యంలో బైకు యాత్ర ఒక్క విశాఖపట్నానికి పరిమితం కాకుండా శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అనకాపల్లి, పాడేరు జిల్లాల్లో కూడా సాగనుంది.

23,24న ఉక్కు రక్షణయాత్ర జయప్రదం చేయాలని కోరుతూ

సిపిఎం పోస్టర్ ఆవిష్కరణ

పార్వతీపురంలో ఉక్కు రక్షణయాత్ర పోస్టర్‌ను ఆవిస్కరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - బెలగాం

విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకై ఉత్తరాంధ్ర ఉక్కు రక్షణ బైక్ యాత్ర జిల్లాలో ఈనెల 23,24 తేదీల్లో జరగనుందని, ఈ యాత్రను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక సుందరయ్య భవనంలో విలేకరుల సమావేశం మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్రా అభివృద్ధికి ఈ ప్రాంత ప్రజల ఉపాధికి ఉపయోగపడే విశాఖ స్టీల్ ప్లాంట్‌ను అమ్మకానికి బిజెపి పెడితే వాపక్షాలు తప్ప ఏ పార్టీలు పోరాడడంలేదన్నారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం 800 రోజులకు పైగా పోరాటం జరుగుతోందన్నారు. దీనికి మద్దతుగా స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం 6 జిల్లాల్లో బైక్ యాత్ర ఈనెల 20 నుంచి 29వరకు జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా పార్వతీ పురం మన్యం జిల్లాలో ఈనెల 23,24తేదీల్లో బైకు యాత్ర జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా పాలకొండ, కురుపాం, పార్వతీపురం, సాలూరు నియోజకవర్గాల్లో ప్రచార సభలు జరుగుతాయన్నారు. సభల్లో రాష్ట్ర, ఉత్తరాంధ్ర నాయకులు పాల్గొంటారని తెలిపారు. అనంతరం ఈనెల 29న స్టీల్‌ప్లాంట్ వద్ద ముగింపు సభ జరుగుతుందన్నారు. వీటిలో జిల్లా ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని, సహాయ సహకారాలు అందజేయాలని కోరారు. పోస్టర్ ఆవిష్కరణ సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు, కె.గంగు నాయుడు, వై.మన్మధరావు, వి.ఇందిర, జిల్లా కమిటీ సభ్యులు ఎన్‌వై నాయుడు, రెడ్డి శ్రీదేవి, ఎం.శ్రీనివాసరావు, కోరాడ. ఈశ్వరరావు, జి.వెంకటరమణ, రెడ్డి లక్ష్మునాయుడు పాల్గొన్నారు. **పాచిపెంట :** ఉక్కు రక్షణ యాత్ర వాల్ పోస్టర్‌ను సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక కమ్యూనిటీ భవనం వద్ద విడుదల చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు సూకురు అప్పలస్వామి, సురు రామారావు, కోరాడ ఈశ్వరరావు పాల్గొన్నారు. **పాలకొండ రూరల్:** ఉత్తరాంధ్ర ఉక్కు రక్షణ బైక్ యాత్ర జయప్రదం చేయాలని, పాలకొండ మండల కేంద్రంలో సిపిఎం బైక్ యాత్ర పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి సభ్యులు ఎం.తిరుపతిరావు, మండల కన్వీనర్ డి. రమణారావు, ఎ.లక్ష్మణరావు, కె.రాము, డి.దుర్గారావు, ఎస్.నారాయణరావు, ఎం.రమేష్, జి.హేమ సుందర్రావు తదితరులు పాల్గొన్నారు. **సాలూరు:** విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం సిపిఎం చేపడుతున్న బైక్ యాత్రను విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎన్నై నాయుడు చెప్పారు. దీనికి సంబంధించిన గోడపత్రికలను ఆయన సిపిఎం పట్టణ నాయకులతో విడుదల చేశారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు టి.వెంకటరావు, టి.రాముడు పాల్గొన్నారు. **కొమరాడ :** ఉత్తరాంధ్ర బైక్ యాత్రను జయప్రదం చేయాలని కోరుతూ సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి ఆధ్వర్యాన కొమరాడలో గోడ పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు శివున్నాయుడు, రైతులు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బైక్ ర్యాలీ జయప్రదం కోరుతూ ప్రచారం

పార్వతీపురంటౌన్ : విశాఖ స్టీల్ ప్లాంట్‌ను రక్షించుకోవడానికి గానూ సిపిఎం ఆధ్వర్యంలో జిల్లాలో ఈనెల 23, 24న జరిగే బైక్ యాత్రను జయప్రదం చేయాలని కోరుతూ స్థానిక ఎల్ఐసి, యూనియన్ బ్యాంకు తదితర చోట్ల సిపిఎం జిల్లా నాయకులు యమ్మల మన్మధరావు గొర్లి వెంకటరమణ, బి.సూరిబాబు మంగళవారం ప్రచారం చేశారు. బైక్ యాత్రను జయప్రదం చేయాలని కోరారు.

నిరుపయోగంగా ఉన్న జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌కు కేటాయించిన భూమి

ముందుకు కదలని జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్

- అభివృద్ధి పనులు చేపట్టని బుడా అధికారులు
- దరఖాస్తుదారుల్లో అయోమయం

ప్రజాశక్తి - సాలూరు

ఎంతో అట్టహాసంగా ప్రారంభించిన జగనన్న స్మార్ట్ టౌన్ షిప్ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మిగిలింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు ప్రక్రియ ప్రారంభించి ఆరు నెలలు కావస్తున్నా ఇంతవరకూ అతీగతిలేని విధంగా తయారైంది. ఈ ఏడాది మేలో డిప్యూటీ సిఎం రాజన్నదొర, బుడా చైర్‌పర్సన్ ఇంటి పార్వతితో సహా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధుల సమక్షంలో ఆడంబరంగా జగనన్న స్మార్ట్ టౌన్ షిప్‌ను ప్రారంభించారు. ఇంతవరకు 30మంది మాత్రమే ప్లాట్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. లేఅవుట్-1లో 109 ప్లాట్లు, లేఅవుట్ -2లో 75ప్లాట్లు వేయాలని అధికారులు నిర్ణయించారు. జాతీయ రహదారి బైపాస్ రోడ్డును ఆనుకుని ఉన్న లేఅవుట్ కోసం 9.47ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. దీనిలో 150 చదరపు అడుగుల విస్తీర్ణంలో 39 ప్లాట్లు, 200 చదరపు అడుగుల విస్తీర్ణంలో 35 ప్లాట్లు, 240 చదరపు అడుగుల విస్తీర్ణంలో 3 ప్లాట్లు రూపకల్పన చేశారు. ఈ లేఅవుట్‌లో చదరపు గజం విలువ రూ.5వేలుగా నిర్ణయించారు. దీనిలో పార్కు కోసం 94 సెంట్లు భూమి కేటాయించారు. సుమారు రూ.ఐదు కోట్లతో ఈ లేఅవుట్‌లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రతిపాదించారు. దుగ్గసాగరం లేఅవుట్ కోసం 5.4ఎకరాల భూమి సేకరించారు. దీనిలో 75ప్లాట్లు వేయాలని నిర్ణయించారు. దీనిలో చదరపు గజం విలువ రూ.4,800గా నిర్ణయించారు. దీనిలో 54సెంట్లు భూమిలో పార్కు కోసం కేటాయించారు. ఇంటర్నల్ రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ, తాగునీటి, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రూ.3.46కోట్లతో ప్రతిపాదించారు. లేఅవుట్ల కోసం రైతుల నుంచి భూములు కొనుగోలు చేసిన తర్వాత బుడా అధికారులు దాన్ని చదును చేసి వదిలేశారు. దీనిలో వంద రూపాయల పని కూడా చేయలేదు. రెండు లేఅవుట్లలో 184 ప్లాట్లకు గాను 30మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది. అంటే 50శాతం కూడా దరఖాస్తు చేసుకోలేదు.

బుడా తీరుపై అనుమానాలు

జగనన్న స్మార్ట్ టౌన్ షిప్ ప్రారంభించి ఆరు నెలలు కావస్తున్నా ఇంతవరకు లేఅవుట్లలో ఏ విధమైన అభివృద్ధి పనులు చేపట్టకపోవడంపై దరఖాస్తుదారుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తం ప్లాట్ విలువలో పది శాతం డబ్బులు దరఖాస్తు సమయంలో చెల్లించారు. దరఖాస్తుదారుల్లో నమ్మకం కలిగించేందుకైనా కనీసం లేఅవుట్లలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టడం లేదు. దీంతో ఈ ప్రాజెక్టు ముందుకు సాగుతుందా లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

తప్పిన పెనుముప్పు...

రాళ్లగెడ్డ ప్రవాహానికి కొట్టుకుపోయిన కారు
డ్రైవర్‌ను రక్షించిన గ్రామస్తులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియ్యమ్మవలస మండలం గడసింగుపురంలో పెను ప్రమాదం తప్పింది. ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి గడసింగుపురం గ్రామ సమీపంలో ఉన్న రాళ్లగెడ్డ వరద ప్రవాహం పొంగిపొర్లింది. దీంతో వీరఘట్టం - జియమ్మవలస ప్రధాన రహదారిపై పీకల్లోతు వరకు రాళ్ల గెడ్డ ప్రవహించింది. రాత్రివేళ వాహనదారులు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. చీకట్లో గెడ్డ తీవ్రత తెలియకపోవడంతో రాత్రి 10 గంటల సమయంలో వీరఘట్టం నుంచి జియమ్మ వలస వెళ్తున్న కారు రోడ్డు దాటేందుకు ప్రయత్నంలో గెడ్డ ప్రవాహానికి కొట్టుకుపోయింది. అటుగా వస్తున్న గ్రామస్తులు గమనించి కారులో డ్రైవర్‌ను రక్షించారు. ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్ జియ్యమ్మవలసకు చెందిన దాసరి స్వామినాయుడు గా గుర్తించారు. కారును జెసిబి సాయంతో బయటకు తీశారు.

పదేళ్లుగా ఇదే సమస్య

వర్షాకాలం వచ్చిందంటే చాలు గత పదేళ్ల నుంచి ఇదే సమస్య ఉందని సిపిఎం మండల కార్యదర్శి కోరంగి సీతారాం తెలిపారు. రాళ్ల గెడ్డ వద్ద కల్వర్టు నిర్మించాలని ఎన్నోసార్లు ప్రజాప్రతినిధులను, అధికారులను కోరినా స్పందించలేదని అన్నారు. ప్రధాన రహదారి వద్ద లోతు ప్రాంతం ఉండడంతో భారీ వర్షాలకు వరద నీరు పొంగి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారుతుందని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రాళ్లగెడ్డ వద్ద కల్వర్టు నిర్మించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

21న జాతీయ ఎస్‌టి కమిషన్ సభ్యులు రాక

ప్రజాశక్తి - పార్వతీపురం

జాతీయ గిరిజన తెగల(ఎస్టీ) కమిషన్ సభ్యులు అనంత్ నాయక్ ఈ నెల 21న జిల్లాకు వస్తున్నారని జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి కె.శ్రీనివాసరావు మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21న ఉదయం 10 గంటలకు పార్వతీపురం చేరుకుంటారని, కురుపాం మండలం రేగిడి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలను తనిఖీ చేస్తారని ఆయన చెప్పారు. రేగిడిలో మధ్యాహ్నం 12 గంటలకు బయలుదేరి పార్వతీపురం చేరుకుని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌ను సందర్శిస్తారని ఆయన అన్నారు. భోజన విరామం అనంతరం గిరిజన సంఘాల నాయకులతో కలుస్తారని, రాత్రికి బస చేస్తారని చెప్పారు. 22నదీ ఉదయం 10.30 గంటలకు జిల్లా అధికారులతో సమావేశం నిర్వహిస్తారని శ్రీనివాసరావు తెలిపారు. అనంతరం బయలుదేరి విశాఖ వెళ్తారని చెప్పారు. సభ్యులతో కమిషన్ అధికారులు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. ఈ బృందం జిల్లాలో ఇప్పటివరకు జరిగిన అభివద్ధి పనులను పరిశీలించనుంది. ప్రభుత్వం నుంచి వస్తున్న నిధులు గిరిజనులకు ఏ మేరకు అభివృద్ధికి దోహదపడ్డాయో సభ్యులు తెలుసుకోనున్నారు.

స్టాల్స్ ఏర్పాటు

గుమ్మలక్ష్మీపురం : ఈనెల 21న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు అనంత నాయక్ జిల్లాకు వస్తున్న సందర్భంగా స్థానిక ఏకలవ్య పాఠశాల సమీపాన ప్రభుత్వ ప్రగతికి సంబంధించిన వివిధ స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ స్టాల్స్ పరిశీలించడానికి ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్ మంగళవారం స్థానిక ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గిరిజన సహకార సంస్థ, ఐటిడిఎ ఇంజినీరింగ్, మండల ఎడ్యుకేషన్ తదితర స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలని ఐటిడిఎ, గిరిజన సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. కేంద్ర ఎస్టీ కమిషన్ ఈ స్టాల్స్ పరిశీలించాక ఏకలవ్య పాఠశాల పనితీరును పరిశీలిస్తారని, అనంతరం ఉన్నతాధికారులతో రివ్యూ నిర్వహిస్తారని పిఒ తెలిపారు.

ఏకలవ్య పాఠశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ఖచ్చితమైన ఓటరు జాబితాయే లక్ష్యం

ప్రజాశక్తి - పార్వతీపురం

ఓటరు పునశ్చరణ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ ఓటరు విచారణలో తప్పుల్లేని శత శాతం ఖచ్చితమైన ఓటరు జాబితా తయారీ లక్ష్యంగా పనిచేయాలని ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్లతో ఓటరు జాబితా తయారీపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వచ్చే అక్టోబర్ 27 నాటికి ముసాయిదా ఓటరు జాబితా ప్రచురిస్తామని, ఈనెల 17 నుంచి నవంబరు 30 వరకు అభ్యంతరాలు, క్లైమ్‌లు స్వీకరించడంలో ప్రత్యేక చొరవ చూపాలని ఆయన అన్నారు. ఇంటింటి ఓటరు విచారణ చేసి శాశ్వతంగా గ్రామాలను వదలిన వారిని, మృతి చెందిన వారిని, డూప్లికేట్ ఎంట్రీ తదితర అంశాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పెండింగ్‌లో ఉన్న ఫారం 7,8లను పరిష్కారం వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ ఇంటింటికీ ఓటరు సర్వే విచారణలో ప్రత్యేక పర్యవేక్షణతో చేపట్టామన్నారు. అనంతరం మృతి చెందిన ఓటర్లు, శాశ్వత వలసలు, డబుల్ ఎంట్రీ ఓటర్లు తొలగింపు విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఏప్రిల్ 15 నుంచి ఇప్పటి వరకు 19,572 ఫారం-6 దరఖాస్తులు, 23738 ఫారం-7 దరఖాస్తులు, 67616 ఫారం-8 దరఖాస్తులు అందాయని ఆయన పేర్కొన్నారు. ఫారం-6 దరఖాస్తులు 1351, ఫారం-7 దరఖాస్తులు 2322, ఫారం-8 దరఖాస్తులు 3298 పరిశీలన పెండింగ్‌లో ఉందని వివరించారు. 10 కంటే ఎక్కువ ఓటర్లు కలిగిన గృహాలు 3727, జంక్ కేరెక్టర్లు ఉన్న 8009 గృహాలను పూర్తిగా విచారణ చేశామని తెలిపారు. జంక్ కేరెక్టర్స్ ఉన్న 1375 ఫారాలు, 10 కంటే ఎక్కువ ఓటర్లు కలిగిన గృహాల్లో ఉన్న 16599 ఫారాలను అప్ లోడ్ పెండింగ్‌లో ఉందని, త్వరలో పూర్తి చేస్తామని చెప్పారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి పోలింగ్ కేంద్రాల పరిధిలోని వలసల, నకిలీ ఓట్ల అభ్యంతరాలు, స్వీకరించిన అనంతరం విచారణ చేపట్టి ఖచ్చితమైన ఓటరు జాబితా రూపకల్పనకు చర్యలు తీసుకుంటున్న చర్యలు వివరిస్తున్నట్లు తెలిపారు. బిఎల్ఒ, సూపర్వైజర్లు ఒకే ఇంట్లో 10 మంది కంటే ఎక్కువ ఉన్న ఓటర్లు వివరాలు, డోర్ నంబర్లు పరిశీలన చేసి ఫామ్ 7,8 లు పూర్తికి ప్రత్యేక దష్టి సారించినట్లు వివరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోవింద రావు, సీతంపేట, పార్వతీపురం ఐటిడిఎ పిఒలు కల్పనా కుమారి, సి.విష్ణు చరణ్, డిఆర్ఒ జె.వెంకటరావు, ఆర్‌డిఒ కె.హేమలత, తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పిన లారీ

తృటిలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

మండలంలోని నర్సిపురం విజయ బ్యాంకు సమీపాన మంగళవారం లారీ అదుపుతప్పి పొలాల్లోకి దూసుకు పోయిన సంఘటన జరిగింది. లారీ డ్రైవర్ ఇంజిన్ ఆపకుండా వాహనాన్ని రహదారి పక్కన ఆపి ఎటిఎంలోకి డబ్బులు తీయడానికి వెళ్లగా, అకస్మాత్తుగా లారీ స్టార్ట్ అయ్, చోదకుడు లేకుండానే ఎదురుగా ఉన్న పొలాల్లోకి దూసుకు పోయింది. ఆ సమయంలో రహదారిపై ఎటువంటి వాహనాలు ఎదురుగా రాకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పిందని స్థానికులు అంటున్నారు.

మార్కొండపుట్టిలో ట్రాన్స్‌కో విజిలెన్స్ విచారణ

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

విచారణ చేస్తున్న వాణిజ్య పన్నులశాఖ అధికారులు

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని మార్కొండపుట్టి పంచాయతీలో ట్రాన్స్‌కో అధికారులు చేపట్టిన పనులపై ఆ శాఖ ఇఇడిపిఇ (విశాఖపట్నం) (ఆపరేషన్) బిఎ రాజశేఖర్, విజిలెన్స్ బృందం మంగళవారం విచారణ చేపట్టింది. ఈనెల 18న మేనెలలో బిల్లులు... సెప్టెంబర్‌లో పనులు.. అన్న శీర్షికన 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన వార్తకు విలువడిన విషయం విధితమే. దీనికి స్పందించిన విజిలెన్స్ అధికారులు బృందం విచారణ చేపట్టింది. గ్రామంలో పనులు జరిగిన తీరును ట్రాన్స్‌ఫార్మర్ ఎప్పుడు ఏర్పాటు చేశారన్న అంశంపై ప్రజలను అక్కడి సిబ్బందిని విచారించారు. ఈ విచారణలో సిబ్బంది తడబడుతూ సమాధానాలు చెప్పారు. అలాగే స్థానికుల సమాధానాలు వేరుగా ఉండడం గమనార్హం. అక్కడ ట్రాన్స్‌ఫార్మర్ పెట్టొద్దని గతంలో వ్యతిరేకించామన్నారు. ఇటీవలే ఎవరికీ తెలియకుండా ఆ ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్ బిగించారని మాజీ సర్పంచ్ తేలు శ్రీరాములు తెలిపారు. అలాగే అదే గ్రామానికి చెందిన ఓ నారాయణ వాంగ్మూలమిస్తూ ఈ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ కనెక్షన్ ఇటీవల ఇచ్చారన్నారు. అంతకుముందు దిగు ప్రాంతం నుండే విద్యుత్ సరఫరా అయ్యేదని తెలిపారు. కొద్ది రోజుల క్రితమే ఇక్కడ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారని ఆయన అన్నారు. అయితే స్థానిక సిబ్బంది ఒకరిపై ఒకరు పొంతన లేని విధంగా సమాధానాలు తెలిపారు. అనంతరం మక్కువ ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద గతంలో పనిచేసిన ఎఇ శివశంకర్ వద్ద కూడా అధికారులు లిఖితపూర్వక వాంగ్మూలం తీసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ గతంలో స్థానిక రికార్డులు బొబ్బిలిలో ఉండేవని, ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లాకు బదిలీ అయ్యాయన్నారు. వీటిని పరిశీలించే ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని తెలిపారు. ఈ విచారణలో

తప్ప కప్పిపుచ్చుకునే యత్నం..!

మార్కొండపుట్టిలో విద్యుత్ శాఖ చేపట్టిన పనుల తీరుపై పత్రికల్లో వెలువడిన వార్తలకు విజిలెన్స్ అధికారులు విచారణకు వస్తున్నారన్న సమాచారంతో విద్యుత్ శాఖ సిబ్బంది ముందుగానే గ్రామంలో నానా హైరానా పడ్డారు. ట్రాన్స్ ఫార్మర్ నుండి ఉదయాన్నే విద్యుత్ సరఫరా అందించిన విషయాన్ని బయటకు పొక్కకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. పనులన్నీ గతంలో కొన్ని నెలలు క్రితం జరిపినట్లు తెలిపేలా తాము చేసిన తప్పులను యత్నించారు. కానీ అప్పటికే మీడియా అక్కడికి చేరుకోవడం స్థానికులు కూడా ఇటీవలే ట్రాన్స్‌ఫార్మర్ అమర్చినట్లు తెలపడం ఇక్కడ విశేషం.

ధాన్యం సేకరణకు సిద్ధం కావాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ లో ధాన్యం సేకరణకు సిద్ధం కావాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవింద రావు అధికారులను ఆదేశించారు. ధాన్యం సేకరణపై జిల్లా స్థాయి కమిటి సమావేశం జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళ వారం జరిగింది. ధాన్యం సేకరణకు గోనె బస్తాలను ముందస్తుగా సిద్ధం చేయాలన్నారు. అక్టోబరు నెలాఖరుకు ఒక కోటి గోనె బస్తాలను సిద్ధం చేయాలని, అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించాలని, సిబ్బంది నియామకం పూర్తి చేయాలని ఆదేశించారు. యాప్ ల వినియోగంలో సిబ్బందికి పూర్తి స్థాయిలో శిక్షణ ఇవ్వాలన్నారు. కూలీలు, రవాణాకు కార్యాచరణ ప్రణాళిక ఉండాలన్నారు. చెల్లింపుల యాప్‌లో నమోదు చేయాల్సిన వాహనాల వివరాలు సేకరించి ముందుగా నమోదుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బ్యాంక్ గ్యారంటీ నిర్దేశిత సమయంలో ఇవ్వాలని సూచించారు. గత ఏడాది అనుభవాల దృష్ట్యా ఏర్పాట్లు పక్కాగా ఉండాలని అందుకు తగిన కార్యాచరణ ప్రణాళిక ఉండాలని స్పష్టం చేశారు. మిల్లర్లు, రవాణా, గోనె సంచులు, బ్యాంక్ గ్యారంటీ, ఎలక్ట్రానిక్ వేయింగ్ స్కేల్స్ తదితర అంశాలపై దృష్టి సారించాలని ఆయన పేర్కొన్నారు.

22న రవాణా కాంట్రాక్టర్లతో సమావేశం

రైతు భరోసా కేంద్రాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతోందని జెసి తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైతు కల్లం నుండి లేదా నిర్దేశిత ప్రదేశం నుండి ఎంపిక చేసిన మిల్లులకు పంపుతామని స్పష్టం చేశారు. ధాన్యం రవాణాకు ముందుకు వచ్చిన రవాణా కాంట్రాక్టర్లు వాహనానికి జిపిఎస్‌ను సొంతంగా అమర్చాలని చెప్పారు. రవాణా కాంట్రాక్టర్లతో ఈ నెల 22న కలెక్టరేట్‌లో సమావేశం ఏర్పాటు చేశామని తెలిపారు. ఆసక్తి గల రవాణా కాంట్రాక్టర్లు ఈ నెల 15వ నాటికి పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ ఎమ్.దేవుళ్ళ నాయక్, మార్కెటింగ్ శాఖ ఎడి ఎల్.అశోక్ కుమార్, సహకార శాఖ సహాయ రిజిస్ట్రార్ ఆర్.రమణ మూర్తి, జిసిసి డి ఎమ్ వి.మహేంద్ర కుమార్, జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షులు కొత్త కోట రమేష్, వైస్ ప్రెసిడెంట్ ఉదయ భాను, తదితరులు పాల్గొన్నారు.

జగన్న ఆరోగ్య సురక్షపై వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఒ ప్రసాద్

జగనన్న ఆరోగ్య సురక్ష పై సదస్సు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని లక్ష్మీపురం గ్రామ సచివాలయంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఎంఎస్ఎల్‌వి ప్రసాద్ మాట్లాడుతూ గ్రామంలో అందరికీ ఆరోగ్య స్వరక్షణపై అవగాహన కలిగించాలన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే నిర్వహించి వారి సమస్యలను తీసుకోవాలన్నారు. కార్యక్రమం ఈనెల 30 నుంచి అక్టోబర్ 31 వరకు అన్ని సచివాలయాల్లోనూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు తుమ్మలపల్లి సత్యవతి, సర్పంచ్ తుమ్మలపల్లి పార్వతి, కన్వీనర్ సురేష్, గ్రామ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

22న యుటిఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలు

ప్రజాశక్తి - సీతంపేట

యుటిఎఫ్ ఆవిర్భావించి 50 ఏళ్లు పూర్తికానున్న సందర్భంగా స్వర్ణోత్సవాలు రాష్ట్ర జాత ఈ నెల 22న సీతంపేటలో జరుగుతున్నందున విజయవంత చేయాలని యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఒరిక భాస్కరరావు, జిల్లా కార్యదర్శి కె.కృష్ణారావు, రాష్ట్ర కౌన్సిలర్ దండు ప్రకాష్ తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం, గిరిజన విద్యాభివద్ధికి యుటిఎఫ్ అనేక సమరశీల పోరాటాలు చేసిందన్నారు. దీని విజయవంతం కోసం సీతంపేట, భామిని, కొత్తూరు, పాలకొండ, వీరఘట్టం, గుమ్మలక్ష్మీపురం మండలాల ఉపాధ్యాయులంతా రావాలని పిలుపునిచ్చారు.

నేడు 'జగనన్నకు చెబుదాం'

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలో బుధవారం నిర్వహించనున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని మండల ప్రజలు వినియోగించుకోవాలని ఎంపిడిఒ మల్లికార్జునరావు, తహశీల్దార్ సిహెచ్ రాధాకృష్ణ కోరారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న జగనన్న చెబుతా కార్యక్రమం ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ కార్యక్రమం మండల ప్రత్యేక అధికారి సత్య నారాయణరెడ్డి ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ హాజరవుతారని తెలిపారు. మండల ప్రజలు వ్యక్తిగత సామాజిక సమస్యలపై అర్జీలు అందజేసేందుకు అవకాశం ఉందని అన్నారు. అర్జీ అందజేసిన ప్రతి సమస్యకు పరిష్కారం దొరుకుతుందని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి అర్జీలు అందజేయాలని కోరారు. కార్యక్రమానికి వచ్చే దూర ప్రాంతాల నుంచి వచ్చే గిరిజనులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. కావున ఈ కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని తెలిపారు.

పింఛను అందజేస్తున్న సర్పంచ్ భర్త రామకృష్ణ

అర్హులకు పింఛన్లు

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని అరసాడ గ్రామ సచివాలయం పరిధిలో అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లను స్థానిక సర్పంచ్ పోల సుజాత భర్త పోల రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి శ్రీహరి, డిజిటల్ అసిస్టెంట్ దేవి సమక్షంలో మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ పార్టీతో సంబంధం లేకుండా గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛను అందించామని, ఇంకా ఎవరైనా అర్హులుంటే వారికి కూడా అందించే ప్రయత్నం చేస్తామని తెలిపారు. పార్టీతో సంబంధం లేకుండా పెన్షన్ అందిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సంగంవలసలో అన్నదానం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మండలంలోని సంగంవలసలో వినాయక చవితి మహోత్సవం సందర్భంగా మంగళవారం అన్నదానం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పరిసర ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో భక్తుల హాజరై ప్రసాదాన్ని స్వీకరించారు. గ్రామంలో ప్రతి ఏటా నవరాత్రి మహోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. గ్రామస్తులంతా సుఖశాంతులతో ఉండాలని, కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా పేదలందరికీ అన్నదాన కార్యక్రమం చేపట్టామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

ఎమ్మెల్యే కళావతికి వినతి

ప్రజాశక్తి - పాలకొండ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెల్లి ఉపకులాల సాధన కమిటీ ఆధ్వర్యంలో రెల్లుల రాజకీయ, ఆర్థిక సమస్యలపై న్యాయం జరగాలని, ఎస్ సి-59 కులాల్లో కులగణన జరగాలని కోరుతూ రాష్ట్ర కమిటీ పాలకొండ ఎమ్మెల్యే విశ్వసరాయి కళావతికి వినతి పత్రం మంగళవారం అందజేశారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో గండి విజయ కుమార్, మజ్జి బాబ్జీ, కొట్నాన రవి, గొల్లపల్లి మోహన్‌రావు, నిమ్మకాయల విజయకుమార్, కోటి మోహన్, బొత్స దుర్గారావు, రాజాన రాజా తదితరులు పాల్గొన్నారు.

జగన్ దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి దిగజారుడు రాజకీయాలతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం పాలు చేస్తూ ప్రతిపక్ష నేతను అక్రమ కేసుల్లో అరెస్టు చేయడానికి జీర్ణించుకోలేని ప్రజలు ప్రభుత్వంపై తిరగబడే రోజులు దగ్గరపడ్డాయని పార్వతీపురం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బోనెలా విజయచంద్ర అన్నారు. చంద్రబాబు అరెస్టుపై నిర్వహిస్తున్న నిరసిస్తూ నవిరి కాలనీ కూడలిలో మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ తో కలిసి రిలే నిరాహారదీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవినీతి ప్రభుత్వాన్ని నిలువరించేందుకు టిడిపితో జనసేన కలిసి రావడాని తాము స్వాగతిస్తున్నామన్నారు. పార్టీలకతీతంగా ఉద్యోగులు, విద్యార్థులు యువత మద్దతుగా ర్యాలీలు నిర్వహించడం చూస్తుంటే చంద్రబాబుపై ప్రజలకు ఉన్న నమ్మకానికి అర్థం పడుతుందన్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు గొట్టాపు వెంకట నాయుడు, ఎఎంసి మాజీ చైర్మన్ రెడ్డి శ్రీనివాసరావు, కౌన్సిలర్లు కోరాడ నారాయణరావు, బడే గౌరినాయుడు, టి.వెంకటరావు, కోలా సరిత, మధుసూదనరావు, నాయకులు బార్నాల సీతారామారావు, బోను చంద్రమౌళి, గురజాన చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

'బాబుతో నేను'లో పోస్ట్ కార్డు ఉద్యమం

కురుపాం : స్థానిక టిడిపి కార్యాలయం వద్ద మంగళవారం తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో బాబుతో నేను కార్యక్రమంలో భాగంగా పోస్ట్ కార్డు ఉద్యమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా పోస్ట్ కార్డు ఉద్యమం చేపట్టామని, బాబు నిర్దోషిగా బయటకు వస్తారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్లు శేఖర్ పాత్రుడు, పల్లారాంబాబు, జియ్యమ్మ వలస ఎంపిపి బొంగు సురేష్, టిడిపి నాయకులు ఎన్.కృష్ణబాబు, పి.వెంకట నాయుడు, నియోజకవర్గంలో గల టిడిపి నాయకులు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సాలూరు: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును విడుదల చేయాలని కోరుతూ టిడిపి నాయకులు, కార్యకర్తలు పోస్టు కార్డ్ ఉద్యమం చేపట్టారు. స్థానిక వెంకటేశ్వరా డీలక్స్ సెంటర్ లో నిర్వహించిన దీక్షా శిబిరం లో టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి సంధ్యారాణి, మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్ దేవ్ హాజరయ్యారు. చంద్రబాబును విడుదల చేయాలని కోరుతూ రాజమహేంద్రవరం జైలు అధికారుల కు టిడిపి నాయకులు కార్యకర్తలు పోస్ట్ కార్డ్‌లు రాసి పంపించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, మండల అధ్యక్షులు ఆముదాల పరమేష్, పాచిపెంట మండల అధ్యక్షులు పిన్నింటి ప్రసాద్ బాబు, మక్కువ మండల నాయకులు మావుడి ప్రసాద్ నాయుడు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : చంద్రబాబు నాయుడుకు మద్దతుగా జియమ్మ వలస మండలం ఇటిక లో టిడిపి నాయకులు పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు.టిడిపి అరకు పార్లమెంట్ ఎస్టీ సెల్ అధికార ప్రతినిధి నందివాడ కష్ణబాబు ఆధ్వర్యంలో బాబుతో నేను అని రాసి పలువురు నాయకులు పోస్టు కార్డులను చంద్రబాబు పేరుతో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు మంగళవారం పోస్ట్ చేశారు.

మహిళలు రిలే నిరాహార దీక్ష

కురుపాం : చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా మంగళవారం నియోజకవర్గ కేంద్రమైన స్థానిక టిడిపి కార్యాలయంలో వద్ద నియోజవర్గ తెలుగు మహిళ అధ్యక్షులు శానాపతి పావని ఆధ్వర్యంలో మహిళలు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కచ్చితంగా టిడిపి గెలుపును ఎవరూ అడ్డుకోలేరని అన్నారు. కార్యక్రమంలో అరుకు పార్లమెంట్ తెలుగు మహిళా ఉపాధ్యక్షులు డొంకాడ మంగమ్మ, అరకు పార్లమెంట్ తెలుగు మహిళా కార్య నిర్వాహక కార్యదర్శి అక్కేన జగదీశ్వరి, టిడిపి సీనియర్ నాయకులు కోలా శ్రీదేవి, నియోజకవర్గంలో తెలుగు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సాలూరులో దీక్షలు చేస్తున్న టిడిపి నాయకులు

కురుపాంలో దీక్షలు చేస్తున్న తెలుగు మహిళా నాయకులు

సీతంపేట : మండల టిడిపి కన్వీనర్ తోట మొఖలింగం ఆధ్వర్యంలో మహిళలు బోనాలతో పులిపుట్టి నుంచి పాదయాత్ర చేపట్టగా టిడిపి నాయకులు పడాల భూదేవి సంఘీభావం తెలిపారు. తోటి మహిళలతో కాలనడకతో ముక్కిడి పోలమ్మ గుడి వరకు వచ్చి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ లు సవర బాజన్న, సుజాత, మన్మధరావు, మహిళ నాయకులు బిడ్డిక జయలక్ష్మి, సంధ్యారాణి, మాజీ ఎంపిపి సవర కుంపి, సీనియర్ నాయకులు సవర మంగయ్య, బిడ్డిక రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు రైతు విభాగం ఆధ్వర్యంలో నిరసన దీక్షలు

గుమ్మలక్ష్మీపురం : టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా కురుపాం మండల కేంద్రంలో రైతు విభాగం ఆధ్వర్యంలో బుధవారం రిలే నిరసన దీక్షలు చేపడుతున్నట్లు కురుపాం నియోజకవర్గం తెలుగు రైతు అధ్యక్షులు గురానా శ్రీరామ్మూర్తి తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని 5మండలాల నుంచి రైతులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

రాష్ట్ర, జిల్లా క్రీడా పోటీలకు గిరి విద్యార్థులు

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్ర, జిల్లా స్థాయి క్రీడా పోటీలకు మండలంలోని మావుడి గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన డిప్పల నవీన్ రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలకు అండర్-17 కేటగిరీలో ఎంపికయ్యాడు. నవీన్ గిరిశిఖర గ్రామం దిగువ రూఢి చెందినవాడు. నవీన్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు కూడా ఎంపికయ్యాడు. చోడిపిల్లి రమేష్ వాలీబాల్, త్రో బాల్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. కొటియా గ్రామాల్లో ఒకటైన దూళిభద్రకి చెందిన విద్యార్థి రమేష్. చోర గ్రామానికి చెందిన చోడిపిల్లి ప్రతాప్ త్రో బాల్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన గిరిజన విద్యార్థులకు ఐటిడిఎ ప్రత్యేక శిక్షణ ఇస్తే భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యే అవకాశం ఉంది. కొద్దిరోజుల క్రితం పిఎన్ బొడ్డవలస సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల మైదానంలో నిర్వహించిన పోటీల్లో మావుడి గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచడం పట్ల పాఠశాల హెచ్ ఎం ఎం.గుర్నాధరావు, స్కూల్ అసిస్టెంట్ ఎల్ జి సన్యాసి, డిప్యూటీ వార్డెన్ ఒ.శంకరరావు అభినందించారు.

అభినందించిన ఉపాధ్యాయులు

ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి క్రీడలకు గురుకులం విద్యార్థులు

గుమ్మలక్ష్మీపురం : ఈనెల 21 నుంచి గుంటూరులో జరగబోయే రాష్ట్రస్థాయి క్రీడ పోటీలకు భద్రగిరి పిటిజి, ఎపి ఆర్ కళాశాల నుంచి పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాల నుంచి ప్రణీత, దివ్య, సంజన, కళాశాల నుంచి అరుణ, చాందిని, ఎపి ఆర్ కళాశాల నుంచి సిద్ధార్థ పోటీలకు వెళ్ళనున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయులు తెలిపారు. వీరు ఎంపిక కావడం పట్ల ప్రిన్సిపాళు అభినందించారు.

గణేష్ నిమజ్జనాలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

జిల్లా పరిధిలో జరుగుతున్న గణేష్ నిమజ్జనలు ప్రశాంతంగా ముగిసేలా పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ పోలీసు అధికారులను ఆదేశించారు. నిమజ్జన ప్రదేశాల వద్ద ఎటువంటి అపశ్రుతులు దొర్లకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులు వారి పరిధిలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను తనిఖీ చేసి వారి నుంచి ఎప్పుడు ఎక్కడ ఎలా నిమజ్జనం చేస్తారనే సమాచారాన్ని కలిగి ఉండాలన్నారు. నిమజ్జనం చేసే ప్రదేశాల్లోని అన్ని చోట్ల అవసరమైన సిబ్బందిని కేటాయించి, బారికేడ్లు, జాగ్రత్త నియమావళి బానర్లు ఏర్పాటు చేయాలని, నిమజ్జన ప్రాంతంలో లైటింగ్ వెలుతురులో చేయాలని సూచించారు. ఈత గాళ్లను అందుబాటులో ఉంచుకొని నిమజ్జనం ప్రాంతంలో పిల్లలు, వృద్ధులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిమజ్జనం వేళ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా నిఘా ఉంచాలన్నారు. నిమజ్జనం యాత్ర జరిగే రహదారులు, కూడళ్ల వద్ద పటిష్ట బందోబస్తుతో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా నిర్దేశిత సమయాల్లోనే నిమజ్జనాలు పూర్తి జరిగేలా చూడాలని, లైఫ్ జాకెట్లు, నాటు పడవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు. ఎస్పీ అదేశాల మేరకు జిల్లాలోని పోలీస్ స్టేషన్ అధికార్లు నిమజ్జనం జరిగే ప్రదేశాల వద్ద అవసరమైన బారికేడ్లు, జాగ్రత్త నియమావళి బానర్లు ఏర్పాటు చేయడం జరిగింది. కమిటీ సభ్యులతో మాట్లాడి నిమజ్జనం సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.

22వ వార్డులో సమస్యలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

సమస్యల పరిష్కారానికి నా అడుగు మీ కోసం

ప్రజాశక్తి.. పార్వతీపురం టౌన్

సమస్యల పరిష్కారానికి నా అడుగు మీకోసం అని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. 'నా అడుగు మీకోసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం 22వ వార్డును స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా మంచినీరు బాగా వస్తుందా, శానిటేషన్ బాగుందా, ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా, ప్రభుత్వ పథకాలన్నీ సకాలంలో అందుతున్నాయా, పింఛన్లన్నీ మీ ఇంటికి తెచ్చిస్తున్నారా లేదా అని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎవరికైనా సమస్యలుంటే వాటిని అక్కడే తెలుసుకుని సంబంధిత అధికారులకు వాటిని అప్పచెప్పి సత్వరమే సమస్యకు పరిష్కారమయ్యేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, పార్టీ పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, వార్డ్ ఇన్‌ఛార్జి ఆకుల శ్రీనివాసరావు, వివిధ వార్డుల కౌన్సిలర్లు ఎస్.లావణ్య, వి.నేతాజీ, కో-ఆప్షన్ సభ్యులు ఎం.వెంకట్రావు, జెసిఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, జిల్లా ఎస్ఎస్ఎల్ అధ్యక్షులు ఎస్ శ్రీనివాసరావు, వైసిపి సీనియర్ నాయకులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, సచివాలయం ఉద్యోగులు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

అందరికీ పథకాలు అందాలి : డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి - సాలూరురూరల్

ప్రభుత్వం అందించే పథకాలు అందరికీ అందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అన్నారు. మండలంలోని పెదపదం పంచాయతీ పరిధిలోని పెదపదం, బాగువలసలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 199వ రోజు మండలంలో చివర రోజు ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి గ్రామానికి విచ్చేసిన ఆయనకు థింసా నృత్యం, కోలాటాలతో ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం బాగువలస ప్రధాన కూడలిలో ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ ఏఏ పథకం కింద ఎంత మొత్తంలో అందుతున్నాయని బుక్‌లెట్ చదివి వినిపించారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్‌పర్సన్ దండి అనంతకుమారి, జిల్లా గ్రంథలయ సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి, ఎంపిపి జి.రాములమ్మ, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, వైస్ ఎంపిపి ప్రతినిధి సువ్వాడ భరత్ శ్రీనివాసరావు, సర్పంచ్ రెడ్డి సుకన్య, జెసి కన్వీనర్ కళ్లేపల్లి త్రినాథ్ నాయుడు, వైసిపి కార్యదర్శి దండి శ్రీనివాసరావు, ఎఎంసి వైస్ చైర్మన్ బాంకురు శ్రీనివాసరావు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

వీరఘట్టం : మండలంలోని వండువ ఆడారు గ్రామాల్లో మంగళవారం స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి, ఎమ్మెల్సీ పి.విక్రాంత్ ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోనే ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న అనేక సంక్షేమం పథకాలు గూర్చి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఎం.కల్యాణి, ఎన్. సుధారాణి, ఎంపిపి డి.వెంకట రమణ నాయు డు, జెడ్‌పిటిసి జంపు కన్న తల్లి- ఉమా మహేశ్వర రావు, మండల ఉపా ధ్యక్షులు పి.విజయ కుమారి, వి.భార్గవ్, పిఎసిఎస్ అధ్యక్షులు కె.గోవిం దరావు, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ కె.లీలాప్రసాద్, నీలం సత్యంనాయుడు, గణపతిరావు, తవిటినాయుడు, పివిఆర్ పురం సర్పంచ్ ఉదయాన జగన్మోహనరావు, సీనియర్ నాయకులు పాలవలస ధవళేశ్వరరావు, మాజీ సర్పంచ్ నీలం జయమ్మ, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి బుక్‌లెట్‌ను అందజేస్తున్న రాజన్నదొర

గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్

వీరఘట్టం : మండలంలోని యు,వెంకంపేట, మహాదేవివలసలో మంగళవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు పి.ఉమామహేశ్వరి, జి.ప్రదీప్ కుమార్ రోగులకు తనిఖీలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ఒ.శాంతకుమారి, ఎఎన్ఎంలు సరస్వతి, పైడితల్లితో పాటు 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కాలువల్లో ప్లాస్టిక్ కవర్లు వేయరాదు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రజలు వీధి కాలువల్లో చెత్తా చెదారం, ప్లాస్టిక్ కవర్లు వేయరాదని స్థానికసర్పంచి బొత్తాడ గౌరీ శంకరరావు అన్నారు. గ్రామంలోని వీధి కాలువల్లో మంగళవారం పారిశుధ్య కార్యక్రమం చేపట్టారు. కాలువల్లో చెత్తాచెదారం వేయడం వల్ల మురుగునీరు నిల్వ ఉండడంతో దోమలు, ఈగలు వ్యాప్తికి అవకాశం ఉంటుందన్నారు. దీంతో వ్యాధులు ప్రబలే అవకాశం కూడా ఉందని తెలిపారు. కావున ప్రజలు కాలువలు పరిశుభ్రంగా ఉంచాలని కోరారు.

30 వరకు ఇ-పంట నమోదు

ప్రజాశక్తి - సీతానగరం

ఈనెల 30 వరకు ఇ-పంట నమోదు జరుగుతుందని మండల వ్యవసాయాధికారి ఎస్.అవినాష్ తెలిపారు. మంగళవారం చినబోగిలి, కాశీపేటలో ఇ-పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఇప్పటివరకు 72శాతం ఈ పంట నమోదైందని, అన్ని గ్రామాల్లోనూ వ్యవసాయ శాఖ సిబ్బంది ఇ- పంట నమోదు చేస్తామన్నారు. కౌలు రైతులు ఆర్‌బికె, వ్యవసాయ సిబ్బంది ద్వారా ఈ పంట నమోదు చేసుకోవాల న్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

ఇ-పంట నమోదును పరిశీలిస్తున్న ఎఒ అవినాష్

రైతు పొలాల్లో శాస్త్రవేత్తలు క్షేత్ర సందర్శన

సీతంపేట : వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త ప్రధాన శాస్త్రవేత్త పి.సీతారాం శాస్త్రవేత్త సౌజన్య బృందంతో మంగళవారం సీతంపేట మండలంలో మల్లిదారి, మల్లి, కుసిమి, పాత్రుని గూడ గ్రామాల్లో ఉన్న పొలాలను సందర్శించారు. ప్రధానంగా ఆకు మడత, చిత్త పురుగు గమనించారు. దీని నివారణకు ఎపిపేట్, 1.5 లేదా నీమాస్త్రం 5, పిచికారీ చేయాలని రైతులకు అవగాహన కల్పించారు. ఎరువులు యాజమాన్యం పద్ధతులు గురించి తెలియజేశారు. చీడపీడల అధ్యయనం చేసి పోషకాల లోపాలు గురించి రైతులకు తెలిపారు. భూసారం సేంద్రీయ వ్యవ సాయంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపిఇఒ గాయత్రి నాయుడు, రైతులు పాల్గొన్నారు.

పి.ఆమిటి లో వైయస్సార్ పొలంబడి

గుమ్మలక్ష్మీపురం : మండలం పి.ఆమిటిలో వైయస్సార్ పొలంబడి మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ పి.షణ్ముఖరాజు మాట్లాడుతూ ప్రతి రైతు తాను పండించిన పంటను ఎటువంటి రసాయన ఎరువులు, పురుగుమందులు వాడకుండా సేంద్రియ పద్ధతిలో పంటలు సాగు చేసుకోవాలని, అటువంటి పంటలను జట్టు తోటపల్లి ఎఫ్‌పిఒ సంస్థ కొనుగోలు చేసేందుకు సన్నాహాలు చేస్తుందన్నారు. రైతులు సేంద్రియ వ్యవసాయంలో పండించిన పంటలకు మంచి మద్దతు ధర వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతుల పొలాలను పరిశీలించారు. రైతులకు తగు సూచనలు సలహాలు అందించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సిహెచ్.ప్రసాద్, పంచాయతీ సర్పంచ్ తాడంగి దమయంతి, వ్యవసాయ శాఖ సహాయకులు ఎన్.పావని, ఎన్ఎఫ్ఎ జి.అన్నపూర్ణ, ఎపి సిఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు అగ్రిగోల్డ్ బాధితుల వినతి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని, వారి డిపాజిట్లను వీలైనంత త్వరగా చెల్లించేలా చర్యలు చేపట్టాలని కోరుతూ అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఈవి నాయుడు ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 12 లక్షల మంది ఖాతాదారులకు రావాల్సిన రూ.3080 కోట్లు డిపాజిట్ సొమ్ము ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసేలోగా స్పష్టమైన ప్రకటన చేసి, అగ్రిగోల్డ్ బాధితులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకొనేలా కేటాయింపు చేయాలని కోరారు. 40 లక్షలకు పైగా ఓట్లు సామర్థ్యం గల అగ్రిగోల్డ్ బాధితులకు ప్రభుత్వం అడ్వాన్స్ చేసి వడ్డీతో పాటు డిపాజిట్లు చెల్లించాలని, కంపెనీ ఆస్తుల నుంచి ప్రభుత్వం తదుపరి జమ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పార్వతీపురం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గెంబలి శ్రీనివాసరావు, సాలాపు అనంతరావు, నాయకులు రామారావు మహారాణా, బాసిగాన వెంకటరమణ (చిరు), తిరుపతిరావు, తులసి మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మృతి చెందిన ప్రసాద్

పురుగుల మందు తాగి యువకుడు మృతి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

పురుగుల మందు తాగి యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని శివంగొరవలసి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన జన్ని ప్రసాద్ (25) వ్యవసాయ కూలీగా పని చేస్తున్నాడు. మంగళవారం పురుగుల మందు తాగానని బంధువులకు తెలియపరచి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. స్పందించిన కుటుంబీకులు జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. మృతునికి ఐదుగురు అక్క చెల్లెలు ఉండగా తల్లిదండ్రులు మరణించారని స్థానికులు తెలియజేస్తున్నారు. ఈ విషయమై అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేసుకుని, శవాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

లారీ ఢీకొని వ్యక్తికి గాయాలు

లారీ ఢీకొని వ్యక్తికి గాయాలైన సంఘటన పార్వతీపురం పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. జిల్లా ఆసుపత్రి అవుట్ పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని నందమూరి కాలనీకి చెందిన రఘు టాటా మ్యాక్స్ వాహనం నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. పార్వతీపురం ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో రఘుకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.